హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలి

అదనపు కలెక్టర్ కు వినపత్రం అందజేస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు

సిద్దిపేట, డిసెంబర్ 4 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆకృత్యాలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో బుధవారం సంఘీభావాన్ని నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఆందజేశారు. ఇస్కాన్ సన్యాసి చిన్మయి కృష్ణ దాస్‌ను అరెస్టు చేసి జైలులో పెట్టడం అమానుషమన్నారు. వెంటనే కృష్ణ దాస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇస్కాన్ రంగా తిరుదాస్, వీరశైవ బలిజ సంఘం, వికాస్ తరంగిణి, వికాస తరంపరని, బార్ అసోసియేషన్, రామచంద్ర మిషన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు సంఘీభావ సభలో పాల్గొన్నారు.

నామినేట్ పదవుల కోసం ప్రాకులాడుతున్న నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాలలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, డిసెంబర్ 4 : రెవెన్యూ డివిజన్ ముసుగులో నామినేట్ పదవులకు కాంగ్రెస్ నాయకులు ప్రాకులాడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆముదాల మాట్లాడారు. ప్రభుత్వం చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించకుండా స్థానిక నాయకులు లోపాయికారిగా ఏకమై అధికార పార్టీ జేఏసీ పేరుతో కాలయాపన చేస్తున్నట్లు ఆరోపించారు. చేర్యాల ప్రాంత ప్రజల ఆకాంక్షను నీరుగార్చే విధంగా అధికార కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నదని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వాగ్దానాన్ని మరిచిపోయి వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, బద్దిపడిగ కృష్ణారెడ్డి, ఆత్తిని శారద, మండల కార్యదర్శులు బండకింది అరుణ్‌కుమార్, తాడూరు రవీందర్, ఎండి షఫీ, పోతిరెడ్డి రాజు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, డిసెంబర్ 4 : పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం (జూనియర్ కళాశాల)లో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, నర్సింగ్ బోధించేందుకు ఇద్దరు మహిళ గెస్ట్ లెక్చరర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఈ నెల 5 నుంచి 9వ తేదీలోగా దరఖాస్తు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి కృష్ణవేణి కోరారు. కళాశాల స్థాయిలో ఇంగ్లిష్ అధ్యాపకురాలు పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పీజీ (బీఈడీ), నర్సింగ్ బోధించే లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, ఫొటో, సంబంధిత పీజీ, బీఈడీ సర్టిఫికెట్స్ అందించాల్సి ఉంటుందన్నారు.

వంట మనుషుల పోస్టుకు..

పట్టణంలోని కేజీబీవీ విద్యాలయంలో వంట మనుషులు (హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ఆర్. కిష్టయ్య కోరారు. అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, చేర్యాల మండల వాసులులతో, వంట అనుభవం కలిగిన వారు అర్హులన్నారు.

మూడింతల పరిహారం ఇస్తేనే భూములు ఇస్తాం..

ఆర్డీవో చంద్రకళ తో మాట్లాడుతున్న ట్రిపుల్ ఆర్ రైతులు

గజ్వేల్, డిసెంబర్ 4: ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో వ్యవసాయ సాగు భూములకు మార్కెట్ ధరకంటే మూడింతల పరిహారం చెల్లిస్తేనే తమ భూములు ఇస్తామని గజ్వేల్ పరిధిలోని కొమటిబండ, అలిరాజ్‌పేట, సామలపల్లి గ్రామాలకు చెందిన బాధిత రైతులు బుధవారం ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన రైతులు తమకు న్యాయం చేసేలా ప్రభుత్వం, కలెక్టర్, ఆర్డీవోలు చూడాలని కోరారు. మార్కెట్ ధర ఎకరాకు రూ.3 కోట్లు ఉందని అందుకు అధికారులు ఎకరాలకు రూ.9 కోట్ల పరిహారం చెల్లిస్తేకాని తమభూములు ఇవ్వమన్నారు. గతంలో కూడా అధికారులను కలిసి తమ గోడు వెళ్ల బోసుకున్నమని రైతులు పక్షాన అధికారులు నిలబడితేనే తమకు న్యాయం జరుగుతుందన్నారు.

బీఆర్ఎస్వీ గురుకుల బాటకు అడ్డంకులు

జగదేవపూర్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 4 : గురుకులాల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన బీఆర్ఎస్ విద్యార్థి నాయకులను గురుకులంలోకి రాకుండా అడ్డుకున్నారు. హుస్నాబాద్‌లోని బాలికల గురుకుల విద్యాలయం సందర్శనకు బుధవారం వెళ్లిన నాయకులను విద్యాలయ ప్రిన్సిపాల్ కలెక్టర్ అనుమతి లేదంటూ గేటుకు తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో నాయకులు అక్కడే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడమే కాకుండా గురుకులాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సిద్దిపేట జిల్లా గురుకుల బాట ఇన్‌చార్జి సూరంపల్లి పరుశరాములు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గురుకులాలు నిర్వీర్యంగా మారాయని ఆరోపించారు. సందర్శనలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎండీ. అన్వర్, హుస్నాబాద్ బీఆర్ఎస్వీ పట్టణాధ్యక్షుడు బొజ్జ హరీశ్, బెజ్జంకి మండల ఇన్‌చార్జి మహేశ్, నాయకులు పల్లె నవీన్‌కుమార్, బత్తుల జగ్జీవన్, కనగండ్ల అజయ్, కందుకూరి సతీశ్, సైఫొద్దీన్, మాంకాలి రమేశ్ తదితరులు ఉన్నారు.

మున్సిఫ్ కోర్టు భవనాన్ని పరిశీలించిన జడ్జి

చేర్యాల, డిసెంబర్ 4 : పట్టణంలో త్వరలో ప్రారంభించనున్న మున్సిఫ్ కోర్టు భవనాన్ని బుధవారం జిల్లా జడ్జి సాయి రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా కోర్టు ఏర్పాటు చేయనున్న భవనంతో పాటు పరిసర ప్రదేశాలను క్షుణంగా పరిశీలించి పనులు చేస్తున్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్.కె. మూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఆసిఫ్ ఇక్బాల్, శ్రీహరి, రవీందర్, చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూమిగారి మనోహర్, న్యాయవాదులు సురేందర్, ప్రణీత్, అమర్ ఉన్నారు. జడ్జి రాక సందర్భంగా సీఐ శ్రీను, ఎస్సై నీరేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 4: ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ సామార్థ్యం గల సబ్‌స్టేషన్ నిర్మాణానికి బుధవారం హుస్నాబాద్ డివిజన్ విద్యుత్ శాఖ డీఈ కృష్ణయ్య స్థానిక విద్యుత్ శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఎంపిక చేసి తమకు అప్పు జెప్పితే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఏడీఈ వెంకట్‌గౌడ్, ఏఈ రాజు, గ్రామస్తులు ఉన్నారు.

వంద టన్నుల అక్రమ ఇసుక సీజ్

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 4 : ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచి రవాణా చేస్తున్న వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. టూటౌన్ ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలో నర్సాపూర్ చౌరస్తా శివ ధర్మకంట సమీపంలో నంగునూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చెల్లారం వెంకట కృష్ణారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా ఇసుకను డంప్ చేసి హిటాచి సాయంతో రవాణా చేస్తున్నాడని సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ సిబ్బంది, పోలీసులతో కలిసి ఏకకాలంలో ఇసుక డంప్‌పై రైడ్ చేసి వంద టన్నుల అక్రమ ఇసుకను సీజ్ చేశామని వివరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా రేషన్ బియ్యం, ఇసుకు అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు.

భూప్రకంపనలు.. భయాందోళనతో ప్రజలు

1960,1992లో... మళ్లీ నేడు భూమికంపించింది

హుస్నాబాద్‌టౌన్: పట్టణంలో భూకంపం వచ్చిన సమయంలో ఇండ్లముందుచేరి చర్చించికుంటున్నప్రజలు

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 4: బుధవారం తెల్లవారుజామున హుస్నాబాద్ ఒక్కసారిగా ఉల్కిపడింది. ఉదయం ఏడు ఇరువై నిమిషాల సమయంలో భూమి కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనల కుగురయ్యారు. దాదాపు మూడుసెకన్ల పాటు భూమికంపించడంతో పట్టణంలోని పలు ప్రాంత ప్రజలు ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందారు. భవనాల్లోని అంతస్తుల్లో ఉన్న భవనాలు ఊగడంతో భయంతో వారు భవనాలనుంచి పిల్లపాపలతో కిందకు దిగివచ్చారు. రేకుల ఇండ్లకు సంబంధించిన వారికి రేకులు చప్పుడు కావడంతో కోతులు అల్లరి చేస్తున్నాయని పలువురు భావించారు. కొందరి ఇండ్లలో స్టీల్‌సామను కిందపడడంతో ఎందుకు ఆలా జరుగుతుందో తెలియక ఇండ్ల నుంచి బయటకు వచ్చారు. సోఫాలో, కుర్చీల్లో కూర్చున్నవాళ్లు సైతం తల తిరిగినట్లు కిందపడేసే విధంగా జరిగినట్లు విలేకరులకు తెలిపారు. భూమి కంపించందనే సమాచారం ఒకరినుంచి మరొకరికి చేరడంతో ప్రజలు ఒకింత భయంతో వణికిపోయారు. హుస్నాబాద్ ప్రాంతంలో 1960 కీలకనామ సంవత్సరంలో భూకంపం వచ్చి పాత ఇండ్లు కూలిపోవడంతో పాటు కొంతనష్టం జరిగినట్లు అప్పటి పరిస్థితులను సీనియర్ సిటిజన్ జనగామ రాంకిషన్‌రావు తెలిపారు. 1992లో సైతం భూకంపం వచ్చిందని కాని తీవ్రత ఎక్కువగా లేదని ఈరోజు సైతం ఆదేవిధంగా ఉందని ఆయన వివరించారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, డిసెంబర్ 4 : సిద్దిపేట పట్టణంలో బుధవారం ఉదయం భూమి కంపించడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఉదయం 7 .30 నిమిషాల నుంచి 7:32నిమిషాల మధ్య 4 సెకండ్ల నుంచి 5 సెకండ్ల వరకు భూమి కనిపించినట్లు స్థానికులు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని నీలకంఠ నగర్, 15వ వార్డుతో పాటు పలు చోట్ల భూమి కనిపించిందని తెలిపారు.

కోహెడలో..

కోహెడ డిసెంబర్ 4: కోహెడ మండలంలో బుధవారం సుమారు 7.30 నిమిషాల ప్రాంతంలో 5 సెకనుల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఇండ్ల నుంచి బయటికి వచ్చారు. కొంత సమయం తర్వాత విషయం తెలుపడంతో ఉపిరి పీల్చుకున్నారు.

ధర్మారంలో..

మిరుదొడ్డి, డిసెంబర్ 4 : మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారంలో బుధవారం ఉదయం 7-35 గంటల సమయం లో భూమి కంపించింది. దీంతో గ్రామంలోని ప్రజలకు కొద్దిసేపు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో భయాందోళనకు గురైయ్యారు. అనంతరం గ్రామ ప్రజ లు భూకంపం వచ్చిందని నిర్ధారణకు వచ్చి తేరుకున్నారు.

ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి

ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి మహేందర్ రెడ్డి

సిద్దిపేట, డిసెంబర్ 4 : ప్రభుత్వం వెంటనే 317 బాధిత ఉపాధ్యాయుల అందరికీ న్యాయం చేయాలని పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. మెదక్ - నిజామాబాద్ -ఆదిలాబాద్ కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి బుధవారం సిద్దిపేట పట్టణంలో ఇంటింటి ప్రచారం రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉపాధ్యాయుల ఇండ్లకు వెళ్లి ఉపాధ్యాయ ఉపాధ్యాయులను ప్రత్యక్షంగా కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధరాసుపల్లి శశిధర శర్మ, సిద్దిపేట అర్బన్ మండల శాఖ అధ్యక్షులు శ్రీ వంగ వెంకట్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

డీఈవో శ్రీనివాస్‌రెడ్డితో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొండపాక (కుకునూరుపల్లి), డిసెంబర్ 4 : విద్య అంటే చదువు ఒక్కటే కాదని చదువుతో పాటు క్రీడలు నైతిక విలువలు కూడా ఉంటాయని, వాటితోనే విద్యార్థి సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో విద్యాశాఖ కార్యాలయంలో జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు కొండపాక బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని రజత పథకాన్ని సాధించడంతో పాటు జాతీయ స్థాయి ఎంపికకావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జిల్లా విద్యశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, ఎస్‌వో రామస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని శుభ్రంగా ఉంచాలి

తడి పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, డిసెంబర్ 4 : మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలని అందుకు ప్రతి ఒక్కరూ చెత్తను మున్సిపల్ చెత్త బండికి ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. బుధవారం 18వ వార్డులో తడి, పొడి చెత్తపై ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కమిషనర్ నర్సయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, బేసిక్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు న్యాయం చేయాలి

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 4 : ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడిన క్షతగాత్రులకు న్యాయం చేయాలని గుర్రాలగొంది గ్రామస్తులు డిమాండ్ చేస్తు సిద్దిపేట బస్సు డిపో ఎదుట బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఆకుల హరీశ్, నేత ఎల్లారెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల కింద మల్యాల చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురు తీవ్రగాయపడ్డారు. అందులో ఇద్దరు స్థానిక ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతుండగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉందని యశోద దవాఖానాకు తరలించారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు,గ్రామస్తులతో కలిసి డిపో ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోని ధర్నాను విరమింపచేసి న్యాయం జరిగేలా చూస్తామని సర్ది చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

గజ్వేల్, డిసెంబర్ 4 : కరెంట్ షాక్‌తో గప్‌చుప్ బండి నిర్వాహకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికిచెందిన వైద్యనాథ్ (22) ఐదేండ్లుగా గజ్వేల్ పట్టణంలో కుటుంబంతో నివాసం ఉంటు గప్‌చుప్ బండి నడుపుతున్నాడు. అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని గప్‌చుప్ బండి నడిపిస్తున్న క్రమంలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడి భార్య సురేఖ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

కొమురవెల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వేలం

కొమురవెల్లి, డిసెంబర్ 4 : కొమురవెల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం తైబజార్‌తో పాటు పలు విభాగాల్లో వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద వాహన పార్కింగ్‌కు రూ.19.31 లక్షలకు హెచ్చు పాట పాడి దక్కించుకున్నాడు. మిగతా సులభ్ కాంప్లెక్స్, అంగడి బజార్ తైబజార్ వేలం పాటలు అఫ్‌సెట్ ప్రైస్ కంటే తక్కువ పాడినందుకు రెండు వేలం పాటలను రద్దు చేస్తున్నట్లు మండల పంచాయతీ అధికారి శ్రీనివాసవర్మ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ ఉన్నారు.

'మల్లన్న' ఆలయంలో నిత్య అన్నప్రసాదానికి విరాళం

ఆలయ అధికారులకు విరాణాన్ని అందజేస్తున్న దాత ఆడపు కుమారస్వామి

చేర్యాల, డిసెంబర్ 4: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాదం కోసం బుధవారం హనుమకొండకు చెందిన ఆడపు కుమారస్వామి దంపతులు శాశ్వత మహారాజ పోషకులుగా రూ. 1,00,116 చెల్లించి, నిత్య ప్రసాద వితరణ పథకంలో సభ్యులుగా చేరారు. అనంతరం దాత ఆడపు కుమారస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు శ్రీరాములు సురేందర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నవీన్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గౌరవెల్లి పూర్తిచేసి నీళ్లు అందిస్తా..

బీసీ సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 4 : హుస్నాబాద్ ప్రాంతంలోని గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చెప్పారు. హుస్నాబాద్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని బుధవారం సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హుస్నాబాద్‌లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మాజీ సీఎం రోశయ్య తృతీయ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, ఆర్డీవో రామమూర్తి, హుస్నాబాద్ ఆర్య వైశ్యసంఘం నాయకులు కొత్త శ్రీనివాస్, శంకరయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేశ్, శ్రీధర్, మాశెట్టి హేమలతతోపాటు పలువురు ఉన్నారు.

కేసులకు భయపడే నేత హరీశ్‌రావు కాదు..

పర్వతాలుయాదవ్

చేర్యాల, డిసెంబర్ 4 : అక్రమ కేసులు, తాటాకు చప్పుళ్లకు భయపడే నేత మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కాదనే విషయాన్ని ప్రత్యర్థులు గుర్తించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ సూచించారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చక్రధర్‌గౌడ్ అనే వ్యక్తి దొంగనోట్లు, మహిళలను వేధించిన కేసులో జైలు జీవితం గడిపాడని, ఉద్యోగాల పేరిట ఆరువేల మంది నిరుద్యోగులను మోసం చేశాడనే విషయం తెలంగాణ సమాజానికి తెలుసునన్నారు. హరీశ్‌రావుపై తప్పుడు విమర్శలు, ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే బీఆర్ఎస్వీ చూస్తూ ఊర్కోదన్నారు.

తప్పుడు ఆరోపణలు మనుకోవాలి

చిన్నకోడూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కామని శ్రీనివాస్

చిన్నకోడూర్ డిసెంబర్ 4 : తప్పుడు ఆరోపణలతో తప్పుడు కేసులు పెట్టి మాజీ మంత్రి హరీశ్ రావును జైల్లో పెట్టాలని చూస్తే రేవంత్ రెడ్డికి చక్రధర్‌గౌడ్‌కు తగిన శాస్తి జరగక తప్పదని చిన్నకోడూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కామని శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చక్రధర్ గౌడ్ వికలి చేతలు మానుకోకుంటే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు ఇట్టబోయిన శ్రీనివాస్, యువ నాయకులు గుజ్జ రాజు తదితరులు ఉన్నారు.

కొండపాకలో..

కొండపాక (కుకునూరుపల్లి), డిసెంబర్ 4 : పలు దొంగతనం కేసుల్లో నిందితుడు, దొంగనోట్ల వ్యాపారి చక్రధర్‌గౌడ్ ప్రజల కోసం పనిచేసే హరీశ్‌రావుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని కొండపాక బీఆర్ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న నూనె కుమార్‌యాదవ్

వి నాయకుడు నూనె కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం కొండపాక మండలంలోని దుద్దెడలో ఆయన మాట్లాడారు. సిద్దిపేటలో చిల్లరగాడు చక్రధర్‌గౌడ్‌తో కేసులు పెట్టించడం చూస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి స్థాయిపై తెలంగాణ ప్రజలు అపహేళన చేస్తున్నారన్నారు. చిక్కుడు భాను, పల్లెబాబు, కెమ్మెరసారం శ్యామ్ కుమార్, ఎండీ. ముగ్ధమ్, రాకేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగదేవపూర్‌లో..

జగదేవపూర్, డిసెంబర్ 4 : ఉద్యమ నాయకుడు మాజీ మంత్రి హరీశ్‌రావుపై చక్రధర్‌గౌడ్ కేసు వేయడం హాస్యాస్పదమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ విమర్శించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ నాయకుడు హరీశ్‌రావుపై కేసు పెట్టడం హాస్యాస్పదమన్నారు.

ఆశవర్కర్లను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కామునిగోపాలస్వామి

ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

సిద్దిపేట కమాన్, డిసెంబర్ 3 : ఆశవర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కామునిగోపాలస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కామునిగోపాలస్వామి మాట్లాడుతూ కనీస వేతనం పీ ఎఫ్, ఈఎస్ఐ, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం దేశానికే అవమానకరమన్నారు. సిద్దిపేట ఇతర మున్సిపల్ పట్టణాల్లో, కొన్ని గ్రామాల్లో 2 వేల జనాభా నుంచి 10 వేల జనభా వరకు ఉన్నదన్నారు. జనాభా పరిమి తి ప్రకారం ఆశాలను పెంచాలిని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్, ఇప్పకాయల శోభ, ఆశయూనియన్ జిల్లా కార్యదర్శి బి.ప్రవీణ, అధ్యక్షురాలు మంజుల, భాగ్య లక్ష్మి, లక్ష్మి, యాదలక్ష్మి, బాలమణి, అరుణ, రేణుక, భా గ్య, కవిత, లక్ష్మి, శోభ, రజిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడేది లేదు..

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

జగదేవపూర్ డిసెంబర్ 4 : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలని మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజి పడేది లేదని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పరఖ్ విద్యా సర్వేను పరీక్ష జరుగుతున్న తీగుల్, కొండాపూర్, బచ్చలిగూడ మందాపూర్, జగదేవపూర్ కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. తీగుల్ పాఠశాలలో బోధన చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు గోపాల్‌రెడ్డిని అభినందించారు. మండల విద్యాధికా మాధవరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నేతలు